సాక్షి
సూర్యాపేట
శుక్రవారం । 12 । జనవరి । 2024



ఉర్సుకు పటిష్ట బందోబస్తు
25 నుంచి నిర్వహించే జాన్‌పహాడ్ ఉర్సుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. - 8లో



సంక్రాంతికి ప్రత్యేక బస్సులు
సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఆర్టీసీ 400 బస్సులను ప్రత్యేకంగా నడపనుంది. - 8లో



దొంగల ముఠా అరెస్టు
తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ముఠాను నకిరేకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈఓను కలిసిన కోదాడ ఎంపీపీ



జెడ్పీ సీఈఓను కలిసిన కోదాడ మండల పరిషత్ అధ్యక్షురాలు రాణి

కోదాడరూరల్ : కోదాడ ఎంపీపీగా నూతనంగా ఎన్నికైన మల్లెల రాణి గురువారం జిల్లా కేంద్రంలో జెడ్పీ సీఈఓ సురేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు. మండల అభివృద్ధిలో తమవంతు సహకారం అందజేస్తామని సీఈఓ తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక

సూర్యాపేటటౌన్ : గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జా దీపిక అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో 1, 7, 2, 4వ స్థాయీ సంఘాల సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు, ఇతర సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి నిధులు చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే సమావేశానికి హాజరు కాని జిల్లా అధికారులకు నోటీసులు జారీ చేయాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు పి.పుల్లారెడ్డి, దావుల వీరప్రసాద్ యాదవ్, జగ్యా, ఎం.కృష్ణకుమారి, దామోదర్‌రెడ్డి, పద్మ, నర్సయ్య, జెడ్పీ సీఈఓ సురేష్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

19న దొడ్డా నర్సయ్య వర్ధంతి



చిలుకూరులో మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు: ఈ నెల 19వ తేదీన చిలుకూరులోని సీపీఐ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం చిలుకూరు సీపీఐ భవన్‌లో నిర్వహించిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్ధంతి సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, ప్రముఖ విద్యావేత్త అందె సత్యం, డాక్టర్ సుబ్బారావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు చేపూరి కొండలు, రెమిడాల రాజు, దొడ్డా వెంకటయ్య, సాహెబ్ అలీ, చిలువేరు అంజనేయులు, వెంకటయ్య, మల్లయ్య, కోటయ్య పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు గ్రామపంచాయతీ నుంచి పార్లమెంట్ స్థాయి వరకు సముచిత స్థానం కల్పించాలని బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్ కోరారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద సామాజికవేత్త, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన బీసీ ఉద్యమాల రూపకర్త సాంబశివరావు రచించిన బీసీ మేనిఫెస్టో గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలన్నారు. బీసీలు శాంతియుతంగా రాజ్యాధికారం దిశగా పయనించాలని పిలుపునిచ్చారు.

• స్కూళ్లలో సంక్రాంతి సంబరాలు





తిరుమలగిరిలోని కృష్ణవేణి పాఠశాలలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు,మేళ్లచెరువు: గాంధీనగర్ తండా కేజీబీవీలో గాలిపటాలు ఎగురవేస్తున్న విద్యార్థినులు

చెరువుల్లో తిమింగలాలు!

- బహిరంగ వేలం పాటలో రింగాట
- వేలంలో కుమ్మక్కైన కాంట్రాక్టర్లు, అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- 98 చెరువులకు గాను 3 చెరువుల వేలం పూర్తి
- దాసాయిగూడెం చెరువు వేలంతో వెలుగులోకి



కలెక్టరేట్‌లో వేలం పాట సమయంలో విత్‌డ్రాకు మంతనాలు చేస్తున్న కాంట్రాక్టర్లు

సూర్యాపేట : సొసైటీలు లేని చెరువులను చేపల పెంపకానికి అనుమతిస్తూ నిర్వహించే వేలం పాటలు ప్రహసనంగా మారుతున్నాయి. పంచాయతీల ఆధ్వర్యంలో వేలం పాటలు మొక్కుబడిగా సాగుతున్నాయని మత్స్యశాఖకు అప్పగించినా తీరుమారడం లేదు. నిర్దేశించిన సమయానికి, విధించిన రుసుము చెల్లించి స్థానికులు బహిరంగ వేలంలో పాల్గొని చెరువులను దక్కించుకోవాలి. కానీ నిబంధనలను తుంగలో తొక్కి అధికారులు, వేలందారులతో కుమ్మక్కై తక్కువ ధరకు చెరువులను కేటాయిస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయానికి గండిపడుతోంది.

పంచాయతీల పరిధిలో 98 చెరువులు

జిల్లాలో చిన్న నీటిపారుదల చెరువులు 673 వరకు ఉన్నాయి. ఇందులో సొసైటీ చెరువులు 575, గ్రామ పంచాయతీ చెరువులు 98 ఉన్నాయి. ఈ చెరువుల్లో ప్రభుత్వం అందించేవాటితో పాటు వేలం పొందిన వ్యక్తులు, సొసైటీ సభ్యులు చేప పిల్లలను పెంచుతారు. ఇంకా కాల్వల ద్వారా చేప పిల్లలు వచ్చి చేరడంతో లాభాలుంటున్నాయి. దీంతో చేపల చెరువులకు డిమాండ్ పెరిగింది. అయితే గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న చెరువులకు ఏటా చేపల పెంపకానికి వేలం నిర్వహించి కాంట్రాక్టర్లకు అప్పగించాలి. గతంలో ఈ ప్రక్రియ గ్రామ పంచాయతీల పరిధిలో జరిగేది. అయితే పంచాయతీల్లో పాలకులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై తక్కువ ధరకు చెరువులు కేటాయిస్తున్నారని గతంలో ఆరోపణలు వచ్చాయి.

> **విచారణ చేపడతాం**
> జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న చేపల చెరువులకు వేలం నిర్వహిస్తున్నట్లు మాకు తెలియదు. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నట్లు కూడా తెలియదు. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం.
> – సీహెచ్ ప్రియాంక, అదనపు కలెక్టర్

దీంతో 2021నుంచి ప్రభుత్వమే బహిరంగ వేలం ద్వారా చెరువులను కాంట్రాక్టర్లకు కేటాయిస్తోంది.

అధికారులు లేకుండానే..

జిల్లా మత్స్యశాఖ అధికారి తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లాలో సొసైటీలు లేని గ్రామ పంచాయతీలు చేపల చెరువులకు వేలం నిర్వహించాలంటే జిల్లా అదనపు కలెక్టర్‌తో పాటు కలెక్టర్ అనుమతి తీసుకోవాలి. పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్, మత్స్యశాఖ అధికారి సమక్షంలో వేలం నిర్వహించాలి. వేలం ప్రకటన స్థానిక పత్రికల్లో ప్రచురించాలి. అయితే జిల్లా మత్స్యశాఖ అధికారికి ఇవేవీ పట్టినట్లు లేదు. జిల్లా అదనపు కలెక్టర్, పంచాయతీ, మున్సిపల్ అధికారులకు తెలియకుండానే వేలం తేదీ ప్రకటించారు. అంతే కాకుండా వేలం జరిగే సమయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సైతం లేకుండా కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా...

- సూర్యాపేట మండలం దాసాయిగూడెం పరిధిలో ఉన్న రెండు చెరువులకు బుధవారం కలెక్టరేట్‌లో బహిరంగవేలం నిర్వహించారు. ఈ చెరువుల వేలానికి ఈ నెల 8న నోటీస్ విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ముందుగా ఉదయం 11 గంటలకు గ్రామ పరిధిలో 35 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువుకు వేలంపాట ప్రారంభించారు. ఈ వేలంలో పాల్గొనేందుకు రూ. 5 వేల చొప్పున 17 మంది డిపాజిట్ రుసుము చెల్లించారు. చెరువు దక్కించుకోవాలనుకున్న కాంట్రాక్టర్ స్థానిక నేతల సహకారంతో వెంటనే పైరవీలు ప్రారంభించినట్లు సమాచారం. వేలంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి రూ. 10 వేల చొప్పున ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఇదంతా వేలం నిర్వహిస్తున్న అధికారుల ముందే జరిగినట్లు సమాచారం. ఇందులో కొందరు డిపాజిట్ రుసుము వెనక్కి తీసుకోగా, మరి కొందరు తీసుకోకపోవడంతో వేలం నిర్వహించగా రూ. 4లక్షలకు చెరువును ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు 6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మరో చెరువుకు వేలం నిర్వహించగా 21 మంది రూ. 5 వేల చొప్పున డిపాజిట్ చెల్లించినా... ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున ఇవ్వడంతో 20 మంది తాము చెల్లించిన డిపాజిట్ విత్‌డ్రా చేసుకున్నట్లు తెలిసింది. ఈ చెరువును రూ. 43 వేలకు కాంట్రాక్టర్‌కు అప్పగించారు.
- ఇటీవల పాలకవీడు మండలం కోమటికుంట గ్రామంలో 45 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును రూ. 4,600కు కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు సమాచారం. ఇవీ.. మత్స్యశాఖ అధికారుల తీరుకు నిదర్శనం.

అవిశ్వాసానికి ముహూర్తం ఖరారు

- 27న ఓటింగ్ నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయం
- సూర్యాపేట మున్సిపల్ పాలకమండలి సభ్యులకు నోటీసులు జారీ
- ఎమ్మెల్యే వద్దకు అవిశ్వాసం పంచాయితీ
- హైదరాబాద్‌కు చేరుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్
- చైర్మన్ రేసులో కొండపల్లి నిఖిల?



సూర్యాపేట: సూర్యాపేట మున్సిపాలిటీలో అవిశ్వాసానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 27న అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించేలా కలెక్టర్ వెంకట్రావ్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ పాలక మండలి సభ్యులకు ప్రత్యేక నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను కమిషనర్ రామానుజులరెడ్డి కౌన్సిల్ సభ్యుల ఇళ్లకు పంపించారు.

27న ఓటింగ్..

చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్‌కుమార్‌లపై అవిశ్వాసం పెట్టాలని 32 మంది కౌన్సిలర్లు తీర్మానం చేసి కాపీని బుధవారం కలెక్టర్‌కు అందజేసిన విషయం విదితమే. ఈ కాపీని పరిశీలించిన అనంతరం కలెక్టర్ అవిశ్వాసంపై ఈనెల 27న ఓటింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్‌పై, మధ్యాహ్నం 1 గంటకు వైస్ చైర్మన్‌పై ఓటింగ్ నిర్వహించాలని కౌన్సిలర్లకు అందజేసిన ప్రత్యేక నోటీసుల్లో ఉంది. ఓటింగ్ రోజు 33 మంది కౌన్సిల్ సభ్యులు సమావేశానికి సకాలంలో హాజరై చేతులెత్తితేనే చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం నెగ్గినట్లవుతుంది.. లేదంటే వీగిపోయినట్లవుతుంది.

అవిశ్వాసం వీగిపోయేలా..

విదేశాల్లో ఉన్న సూర్యాపేట శాసనసభ్యుడు గురువారం హైదరాబాద్‌కు గురువారం చేరుకున్నారు. చైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ కిషోర్‌లతో పాటుగా మరికొంత మంది కౌన్సిల్ సభ్యులు హైదరాబాద్‌కు రావాలని కబురు రావడంతో హుటాహుటిన వారు వెళ్లారు. అవిశ్వాసం వీగిపోయేలా ఎమ్మెల్యే ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం తమ వద్ద ఉన్న సభ్యులను కాపాడుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

చైర్మన్ రేసులో 31వ వార్డు కౌన్సిలర్?

సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ రేసులో 31 వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలదిలీప్‌రెడ్డి రేసులో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆమె భర్త దిలీప్‌రెడ్డి 32 మంది కౌన్సిల్ సభ్యులతో అవిశ్వాస తీర్మానం కాపీపై సంతకాలు చేయించినట్లు సమాచారం. అంతేకాకుండా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ కౌన్సిలర్లతో కూడా టచ్‌లో ఉండడమే కాకుండా కొంతమంది కౌన్సిలర్లను ఇప్పటికే క్యాంపునకు తరలించినట్లు తెలిసింది. అవిశ్వాసం నెగ్గి చైర్మన్ పీఠం దక్కించుకోవాలన్న ధీమాలో ఉన్నట్లు సమాచారం. అలాగే వైస్ చైర్మన్ రేసులో కౌన్సిలర్లు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, కక్కిరేణి శ్రీనివాస్ , పోలగాని బాలుగౌడ్, బైరు శైలేందర్‌గౌడ్, షేక్ జహీర్ ఉన్నట్లు తెలిసింది.

ప్రమాదాల నివారణకు చర్యలు

•ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా పరిధిలోని జాతీయ రహదారి 65 పై ఎలాంటి రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా జిల్లా పోలీస్‌శాఖ నివారణ చర్యలు చేపట్టిందని ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని కోరారు. దూర ప్రయాణం వల్ల అలిసిపోవడం, నిద్ర మత్తు కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అందువల్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చలి ప్రభావం, పొగమంచు కారణంగా రాత్రి వేళ ప్రయాణంలో డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసర సమయంలో రహదారుల అధికారులకు గానీ డయల్ 100 కు గానీ ఫోన్ చేసి సహాయం తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రక్కన ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపవద్దని కోరారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. తప్పుడు మార్గంలో వాహనాలు నడిపినా, రోడ్లపై న్యూసెన్స్ చేసినా కేసులు నమోదు చేయాలని సూచించారు.

ఫణిగిరి బౌద్ధక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని వినతి



హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేస్తున్న వీరమల్లు యాదవ్

నాగారం : ఫణిగిరి బౌద్ధక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పులిగిల్ల వీరమల్లు యాదవ్ గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరమల్లు మాట్లాడుతూ ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద జరిపిన తవ్వకాల్లో బయల్పడిన బౌద్ధ సంపద ప్రాచీన చరిత్ర కలిగి ఉందన్నారు. ఫణిగిరిని ప్రపంచ పర్యాటక ప్రాంతంగా మార్చితే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఓబన్న సేవలు మరువలేనివి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సంచార జాతుల ఆరాధ్య దైవం వడ్డె ఓబన్న సేవలు మరువలేనివని అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక , ఎ. వెంకటరెడ్డిలు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓబన్న జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో ఒడ్డె ఓబన్న సైన్యాధ్యక్షుడిగా పని చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారి వై. మాధవ రెడ్డి, గిరిజన అభివృద్ధి అధికారి శంకర్, డీఈఓ అశోక్, డీఎంహెచ్‌ఓ కోటా చలం తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయక కోణం



కోణం సాందీప్



- ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్‌లో సత్తా చాటుతున్న కోణం సాందీప్
- డాక్టర్లు, పేషంట్లకు ఉపయోగపడేలా యాప్ రూపకల్పన
- ఇప్పటికే అమెరికాలోని ప్రతిష్టాత్మక ఫోర్బ్స్ మ్యాగజైన్‌లో చోటు
- అమెరికా, కెనడాతో పాటు నల్లగొండలోనూ ఐటీ కంపెనీల స్థాపన
- స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న 29 ఏళ్ల యువకుడు
- నేడు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సాందీప్ సక్సెస్‌పై స్పెషల్ స్టోరీ



సాక్షి, నల్లగొండ డెస్క్ :

'లేచి నిలబడు, ధైర్యం వహించు, బలవంతుడివికా.. బాధ్యతనంతా నీ భుజాలపైనే వేసుకుని, నీ విధికి నీవే కర్తవని తెలుసుకో. నీకు కావలసిన బలం, సహాయం అంతా నీలోనే ఉంది. అందుకే నీ భవితవ్యాన్ని నీవే నిర్మించుకో' అని స్వామి వివేకానంద చెప్పిన సూక్తిని ఆ యువకుడు అక్షరాలా ఆచరించాడు. ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్‌లో తన పరిశోధనలతో ప్రపంచ అగ్రరాజ్యమైన అమెరికా దృష్టిని ఆకర్షించి ప్రతిష్టాత్మక ఫోర్బ్సు మ్యాగజైన్‌లో చోటు దక్కించుకున్నాడు. స్వస్థలంపై మమకారంతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఇంజనీరింగ్ పట్టభద్రులకు మెళకువలు నేర్పించి ఉపాధికి బాటలు వేస్తున్నాడు. ఉద్యోగంతో సంతృప్తి చెందని ఆ యువకుడు తానే స్వయంగా ఐటీ కంపెనీలు స్థాపించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. **నేడు జాతీయ యువజన దినోత్సవం** (స్వామి వివేకానంద జయంతి) సందర్భంగా.. నల్లగొండ జిల్లా కట్టంగూరుకు చెందిన కోణం సాందీప్‌పై ప్రత్యేక కథనం.

సాందీప్ పదవ తరగతి వరకు నల్లగొండలో చదివాడు. వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయలోని ట్రిబుల్ ఐటీ(ఆర్‌జీయూకేటీ)లో సీటు పొంది ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో బీటెక్‌తో పాటు కంప్యూటర్ సైన్స్‌లో మైనర్ డిగ్రీ కూడా పూర్తి చేశాడు. ఆ తర్వాత అమెరికాలోని ప్రపంచస్థాయిలో ప్రథమ స్థానంలో ఉన్న కార్నెగీ మెలన్ యూనివర్సిటీ (సీఎంయూ)లో ఎంఎస్ రీసెర్చ్ ఇన్ రోబోటిక్స్‌లో అడ్మిషన్ పొందాడు. 2017లో ఎంఎస్ పూర్తయిన తర్వాత అక్కడే పీట్‌బర్గ్‌లోని యూపీఎంసీ కంపెనీలో సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరాడు. అయితే, ఉద్యోగంతో సంతృప్తి చెందని సాందీప్.. 2018లో 'ఆబ్రిడ్జ్' పేరుతో కంపెనీ నెలకొల్పాడు. ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ (ఏఐ)పై రీసెర్చ్ చేసి డాక్టర్స్, పేషెంట్స్‌కు ఉపయోగపడే విధంగా యాప్ రూపొందించాడు. అప్పటి వరకు ఎవరూ చేయని విధంగా ఈ యాప్ ఉండడంతో అమెరికాలో పేటెంట్ వచ్చింది. వైద్యులు రాసే సమాచారాన్ని అత్యంత స్పష్టంగా, భద్రంగా రోగులకు వారి మాతృభాషలోనే తర్జుమా చేస్తుంది. దాంతో పాటు వైద్య నిపుణులు ఇచ్చే సలహాలు, సూచనలు రోగులు గుర్తుంచుకొని, అర్థం చేసుకుని పాటించేలా ఈ యాప్ రూపకల్పన చేశాడు. 2020 అక్టోబర్‌లో యాప్‌ను పూర్తిస్థాయిలో విడుదల చేశాడు.



కరోనా కాలంలో..

ఈ యాప్‌పై అమెరికాలోని పలు యూనివర్సిటీల్లో సాందీప్ ఉపన్యాసాలు కూడా ఇచ్చాడు. కరోనా కాలంలో ఈ యాప్ వైద్యులకు, రోగులకు బాగా ఉపయోగపడింది. దీంతో మరింత గుర్తింపు వచ్చింది. ఆయన టీం అమెరికాతో పాటు కెనడాలో కూడా ఉంది. తరువాత హిట్లూప్, కోణం ఫౌండేషన్ సంస్థలను స్థాపించాడు. ఇతర దేశాల నుంచి కూడా ఆఫర్స్ వస్తున్నాయని, తర్వలో మరికొన్ని దేశాల్లో తన కంపెనీని స్టార్ట్ చేస్తానని సాందీప్ చెప్పాడు.



చదువుకునే సమయంలోనే రోబోటిక్స్‌పై పరిశోధన

ప్రస్తుతం ప్రపంచమంతా రోబోటిక్స్ మీద దృష్టిపెట్టింది. రోబోటిక్స్‌పై సాందీప్ తాను చదువుకునే సమయంలోనే పరిశోధనలు మొదలుపెట్టాడు. పదేళ్లకు పైగానే దీనిపై ఆయన పరిశోధన చేస్తున్నాడు. వ్యవసాయం, విద్యా రంగాలపై తన దృష్టిపెట్టాడు. వ్యవసాయంలో ముఖ్యంగా పత్తి పంటలో మెరుగైన పద్ధతులను సాంకేతికంగా ఎలా విస్తరించాలని, రైతులకు ఎలా అవగాహన కల్పించాలనే వాటిపై పరిశోధన సాగిస్తున్నారు. విద్యా రంగంలో మూగ వారి కోసం అవసరమయ్యే ఉపకరణాలపై పరిశోధన చేస్తున్నాడు.

నల్లగొండ ఐటీ హబ్‌లో మొదటి కంపెనీ ఇదే..

నల్లగొండలో ఐటీ కంపెనీ పెట్టాలని కొన్ని రోజులుగా ఆలోచన చేస్తుండగా.. ఇటీవల ఐటీ హబ్ ప్రారంభమైంది. ఇందులో సాందీప్‌కు చెందిన హిట్లూప్ కంపెనీయే మొదటిది. హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల్లో నల్లగొండ వారే ఎక్కువగా ఉన్నారు. స్థానికంగా కొందరు టాలెంట్ ఉన్నా హైదరాబాద్‌కు రాలేకపోతున్నారని గుర్తించి ఇక్కడే ఐటీ కంపెనీ ప్రారంభించాలని భావించాడు. స్థానిక యువతకు ఐటీ పరంగా యూనివర్సిటీలో అభ్యసన అంతగా ఉండదు కాబట్టి వారికి తాను 2016లో స్థాపించిన కోణం ఫౌండేషన్ ద్వారా మెళకువలు నేర్పుతున్నాడు. ఈ ఫౌండేషన్ ద్వారా ఫెలోషిప్ కూడా ఇస్తున్నాడు. ఇటీవల కడప జిల్లాలో ఫెలోషిప్ ప్రారంభించాడు. ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ (ఏఐ)లో ఆసక్తి ఉన్న వారికి శిక్షణ పొందే విధంగా తయారు చేస్తున్నారు.



నల్లగొండ ఐటీ హబ్‌లోని సాందీప్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులు

క్లుప్తంగా

కేంద్ర పథకాలు అందరికీ చేరాలి


మాట్లాడుతున్న రవీంద్రకుమార్

నేరేడుచర్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ చేరాలని కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఆర్థిక సలహాదారుడు రవీంద్రకుమార్ జన అన్నారు. గురువారం నేరేడుచర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని మాట్లాడారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టారని తెలిపారు. వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు పీఎం జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్, పీఎం స్వహనిధి, ముద్రయోజనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 2047 నాటికి అభివృద్ధి సాధించడంతో తమ వంతుగా భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులకు సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పబ్లిసిటీ అధికారి కోటేశ్వర్ రావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ బాబుపూజీ, నాబార్డ్ జిల్లా డీఎం సత్య నారాయణ, ఎస్‌బీఐ మేనేజర్ ఫణికుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రోగ్రాం మేనేజర్ వక్తయ్య, ఏపీ గ్రామీణ వికాస బ్యాంకు ఆర్థిక కేంద్ర మేనేజర్ జగదీశ్వర్, వైద్యాధికారులు కళ్యాణ్, నాగిని, కౌన్సిలర్ బాణోతు లలిత, మున్సిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు ఉన్నారు.

సాగర్‌లో కరోనా కేసు నమోదు

నాగార్జునసాగర్: పర్యాటక ప్రదేశమైన నాగార్జునసాగర్ నందికొండలో ఈ యేడాది మొదటగా గురువారం కరోనా కేసు నమోదైంది. అనుమానితులుగా కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రికి 22మంది రాగా వారికి పరీక్షలు నిర్వహించారు. అందులో ఒకటి పాజిటివ్ వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, విధిగా మాస్కులు ధరించాలని డాక్టర్లు సూచించారు.

14న గోదాదేవి కల్యాణం

యాదగిరిగుట్ట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 14వ తేదీన గోదాదేవి–శ్రీరంగ నాథుడి కల్యాణ వేడుకను నిర్వహించనున్నారు. మరుసటి రోజు అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని ఆచార్యులు చేపడతారు. కాగా.. గోదాదేవి నీరాటోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో నిత్య కల్యాణ సేవతో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సేవను ఆలయ తిరు, మాఢ వీధిలో ఊరేగించారు.

• మొదలైన పండుగ రద్దీ

సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం నుంచి రద్దీ పెరిగింది. శుక్రవారం నుంచి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో గురువారం సాయంత్రం నుంచే ప్రజలు సొంతూళ్లకు వెళ్తున్నారు. దీంతో బస్టాండ్లలో రద్దీ నెలకొంది. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని పంతంగి జీఎంఆర్ టోల్‌ప్లాజా వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. విజయవాడ వైపునకు పది టోల్ ద్వారాలను తెరిచి ఉంచారు.


చౌటుప్పల్: విజయవాడ జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు


నల్లగొండ బస్టాండ్‌లో బస్సులు ఎక్కేందుకు కిక్కిరిసిన ప్రయాణికులు


ఊరెళ్లేందుకు కుటుంబంతో కలిసి నల్లగొండ బస్టాండ్‌కు వస్తున్న ప్రయాణికులు


భువనగిరి బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు వస్తున్న విద్యార్థులు

సంక్రాంతికి 400 ప్రత్యేక బస్సులు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12, 13, 14 తేదీల్లో నడపనున్న ఆర్టీసీ అధికారులు
- ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక బస్సులు నిల్
- మహిళలకు ఉచితంగానే ప్రయాణం


భువనగిరిలో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

నల్లగొండ రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 400 బస్సులు ప్రత్యేకంగా నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అందుకు అనుగుణంగా అన్ని డిపోల నుంచి 10 బస్సుల చొప్పున ప్రత్యేకంగా నడపనున్నారు. ఈ బస్సుల్లో సైతం మహిళలకు ఉచిత ప్రయాణమే అమలు చేయనున్నారు. గతంలో సంక్రాంతి పండుగకు 350 బస్సులను ప్రత్యేకంగా నడిపేవారు, కానీ ఈసారి మహిళలకు ఉచిత ప్రయాణం అమలులో ఉండడంతో అదనంగా మరో 50 బస్సులను నడుపుతున్నారు. ఈసారి డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా సాధారణ టికెట్ ధరనే ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు.

పెరిగిన ప్రయాణికుల సంఖ్య..

ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు 1.75 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా.. ఇందులో 70 వేల మంది మహిళలు ప్రయాణించేవారు. ఉచిత ప్రయాణంతో ప్రస్తుతం రోజుకు 3లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు అధికారులు లెక్కలు వెశారు. ఇందులో 2లక్షల మంది మహిళా ప్రయాణికులే ఉన్నారని నిర్ధారించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7 డిపోల నుంచి 649 బస్సులు ఉండగా అందులో ఎక్స్‌ప్రెస్ 69, డీలక్స్ 70, సూపర్ లగ్జరీ 48, పల్లె వెలుగు బస్సులు 462 ఉన్నాయి. ప్రతి రోజు 2,47,899 కి.మీ. దూరం బస్సులు నడిపి ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మహిళా ప్రయాణికులు పెరిగారు



మహలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులో ఉండటంతో గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు 70 వేల మంది మహిళలు ప్రయాణిస్తే ఇప్పుడు 2లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సంక్రాంతి పండుగకు తగిన ఏర్పాట్లు చేశాం. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా బస్సులు నడపడంలేదు. గతం తరహాలోనే ఆయా డిపోల పరిధిలో బస్సులు నడుపుతాం.

– శ్రీదేవి, రీజనల్ మేనేజర్, నల్లగొండ

ఇతర రాష్ట్రాలకు లేవు..

దేవరకొండ, నల్లగొండ, కోదాడ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, మిర్యాలగూడ, యాదగిరిగుట్ట డిపోల పరిధిలోనే గతం తరహాలోనే బస్సులు నడుపుతామని, ఇతర రాష్ట్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడపడంలేదని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

తండ్రిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

చివ్వెంల(సూర్యాపేట): తండ్రిని హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదు విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. పెన్‌పహాడ్ మండలం జల్మల్‌కుంట తండాకు చెందిన నునావత్ స్వామి, నునావత్ సరోజ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. తన భార్య సరోజతో వివాహేతర సబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో స్వామి తన తండ్రి నునావత్ భీక్యాను 2020 మార్చి 28వ తేదీ మధ్యాహ్నం గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న మంచం కర్రతో తండ్రి భీక్యా తలపై స్వామి పలుమార్లు కొట్టడంతో అతడు తీవ్రగాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు భీక్యాను సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతిచెందాడు. భీక్యా పెద్ద కుమారుడు పాండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి స్వామిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పలువురు సాక్షులను విచారించిన సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ గురువారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడు స్వామికి జీవిత ఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు సహకరించారు.

భార్యను చంపిన కేసులో.. చర్లపల్లి జైలులో నిందితుడు..

జీవిత ఖైదు పడ్డ నిందితుడు స్వామి భార్యను చంపిన కేసులో ప్రస్తుతం హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. తండ్రిని చంపిన మూడు నెలలకే బెయిల్‌పై బయటకు వచ్చిన స్వామి భార్యను నరికి చంపాడు. ఈ కేసుకు సంబంధించి గత సంవత్సరం మే నెలలో స్వామికి అప్పటి జిల్లా న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. కాగా తండ్రి హత్య కేసు లేట్‌గా ట్రయల్ కావడంతో శిక్ష శుక్రవారం పడింది.

మహిళ హత్య కేసులో నిందితుల రిమాండ్

మద్దిరాల: మండల కేంద్రానికి చెందిన కుంచం కళమ్మ(46) హత్య కేసులో నిందితులైన ఆమె భర్త కుంచం వెంకన్న, మృతురాలి ఇంట్లో కిరాయికి ఉంటున్న కసనబోయిన రాజ్యం, ఆమె భర్త కసనబోయిన వెంకన్నను సీఐ బ్రహ్మమురారి గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కుంచం వెంకన్న, కళమ్మ దంపతులకు కుమారుడు సింహాద్రి ఉన్నాడు. వీరికి మద్దిరాల మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద సొంత ఇల్లు ఉంది. అందులో రెండు షెటర్లు ఉండగా.. ఒక షెటర్‌ను కసనబోయిన రాజ్యం, ఆమె భర్త వెంకన్నకు 5 సంవత్సరాల అగ్రిమెంట్‌కు కిరాయికి ఇచ్చారు. కాగా వెంకన్న కిరాయికి ఉంటున్న కసనబోయిన రాజ్యంతో సన్నిహితంగా ఉండడాన్ని కళమ్మ గమనించి రాజ్యం, ఆమె భర్త వెంకన్నను ఇల్లు ఖాళీ చేయాలని చెప్పింది. కానీ 5సంవత్సరాల వరకు అగ్రిమెంట్ ఉందని, తాము ఖాళీ చేయమని వారు చెప్పారు. ఇదే విషయమై కళమ్మ, వెంకన్న మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. ఇంటి నిర్మాణం కోసం, ఇతర ఖర్చుల నిమిత్తం అప్పులు అయ్యాయని రెండు షెటర్లలో ఒకదానిని అమ్మాలని వెంకన్నకు చెప్పగా భార్య కళమ్మ, కొడుకు సింహాద్రి ఒప్పుకోలేదు. అయినప్పటికీ వెంకన్న తన భార్య, కొడుకుకు తెలియకుండా చామకూరి నారాయణకు రూ.55లక్షలకు అమ్ముతానని అందుకు రూ.10లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుని సంతకం పెట్టమని ఈ నెల 8న భార్య కళమ్మతో గొడవపడ్డాడు. దీనికి ఆమె తిరస్కరించడంతో కుంచం వెంకన్న, కసనబోయిన రాజ్యం, కసనబోయిన వెంకన్న, చామకూరి నారాయణ, చామకూరి మల్లయ్య, కుంచం లింగయ్య సహకారంతో అదేరోజు సాయంత్రం 6గంటల సమయంలో భార్య కళమ్మకు బలవంతంగా గడ్డిమందు తాగించడంతో ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 9వ తేదీన సూర్యాపేటలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు సింహాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కుంచం వెంకన్న, కసనబోయిన రాజ్యం, కసనబోయిన వెంకన్నను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గురుకుల దరఖాస్తుల గడువు పొడగింపు

రామగిరి(నల్లగొండ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ గడువు పొడగించినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఆకుల భిక్షమయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 11వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం..

ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లలో అడ్మిషన్లు పొందేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు ఫిబ్రవరి 15వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్‌సీఓ షకీనా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు రూ. 100 చెల్లించి www.mjptbcwreirs.telangana.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 3వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 040–23328266 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి..

నల్లగొండ: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024– 25 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ప్రతిభా కళాశాల(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) గంధంవారిగూడెం ప్రిన్సిపాల్ డాక్టర్ లలితకుమారి గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 39 ప్రతిభా కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో బాలురు, బాలికల నుంచి దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు రుసుము రూ.200 చెల్లించాలని, దరఖాస్తు చివరి తేదీ ఈనెల 15 వరకు ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, వివరాలకు www.tswreis.ac.inను సంప్రదించాలని కోరారు.

సీఎం పీఆర్‌ఓగా మామిడాల శ్రీధర్


సీఎం రేవంత్‌రెడ్డితో పీఆర్‌ఓ శ్రీధర్

ఆలేరురూరల్ : ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన మామిడాల శ్రీధర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీఆర్‌ఓగా నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి పీఆర్‌ఓగా నియమితులైన శ్రీధర్‌కు గ్రామస్తులు, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

డీఈఈ సెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షెడ్యూల్

నల్లగొండ: డీఈఈ–సెట్(2023)లో ర్యాంకు సాధించి గతంలో ఫేజ్–1 సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాని వారికి 2023–25 బ్యాచ్‌లో మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఫేజ్–2 సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్ విడుదలైనట్లు నల్లగొండ పట్టణంలోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కానుగుల నర్సింహ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీన డైట్ కళాశాలలో ఫేజ్–2 సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకునేందుక అవకాశం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు డీఈఈ–సెట్(2023)లో సాధించిన ర్యాంకు ప్రకారం వెబ్ ఆప్షన్ల నమోదు, 25వ తేదీన సీట్ల కేటాయింపు, 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఫీజు పేమెంట్, కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. 31వ తేదీన స్లైడింగ్ అనంతరం ఫేజ్–2లో కన్వర్షన్ ప్రకారం సీట్ల కేటాయింపు జరగనుంది. ఫిబ్రవరి 1నుంచి 3 వరకు కన్వర్షన్ అనంతరం కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు చేయించరు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల రామచంద్రారెడ్డి


నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

నల్లగొండ టూటౌన్: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ సంస్థలు, భూ మాఫియాపై సీబీఐ విచారణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పెద్దలు, అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. గురువారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాకోర్టులో నిలబెడతామని, ఆరు గ్యారంటీల పథకాల కోసం రూ.85 వేల కోట్లు ఖర్చు అవుతుందని, ఈ నిధులు ఎక్కడి నుంచి తెస్తారో, ఎలా అమలు చేస్తారో ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సీబీఐ విచారణ చేయించాలని అడిగితే మంత్రి ఉత్తమ్ మాట్లాడిన తీరు సరైందికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ చేయించాలన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ఎంత సమయంలో పూర్తి చేస్తారో మంత్రులు చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అవినీతి చేసిందనే మిమల్ని గెలిపించారన్నారు. తెలంగాణ అభివృద్ధికి 9 ఏళ్లలో మోదీ ప్రభుత్వం 9 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. రైతుబంధు కోసం బ్యాంకులో ఉన్న రూ.7700 కోట్లు ఎక్కడి పోయాయని ప్రశ్నించారు. నెల రోజులు దాటినా రైతుబంధు ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం ఎందుకు చేస్తుందో సమాధానం చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీల పథకాల అమలు ఎన్నికల కోడ్ వచ్చే దాకా జాప్యం చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు బండారు ప్రసాద్, కంకణాల శ్రీధర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల నరసింహారెడ్డి, గార్లపాటి జితేంద్రకుమార్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ ఉర్సుకు పటిష్ట బందోబస్తు

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే


జాన్‌పహాడ్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

పాలకవీడు: మండలంలో ఈ నెల 25వ తేదీ నిర్వహించనున్న జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. గురువారం జాన్‌పహాడ్ దర్గా వద్ద రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. దర్గాకు ఏయే రూట్‌ల నుంచి భక్తులు చేరుకుంటారు.. వాహనాల రాకపోకలు.. ఎంత మంది భక్తులు వస్తారనేది వక్ఫ్‌బోర్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు దర్గాలో ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు దర్గా ముజావర్ జానీ స్వాగతం పలికారు. సైదులుబాబా సమాధులపై చాదర్ దట్టీలను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26న జరగనున్న గంధం ఊరేగింపు, బాబా దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని, భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా 500 మంది పోలీసులు, స్పెషల్, రోప్ పార్టీ బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. నేరేడుచర్ల, మఠంపల్లి మండలాల నుంచి వచ్చే భక్తులకు జాన్‌పహాడ్ రూట్‌లో, దామరచర్ల నుంచి వచ్చే భక్తులకు శూన్యపహాడ్ రూట్‌లో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖుల దర్శనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని డీఎస్పీ ప్రకాష్‌ను ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలను శుభ్రం చేయించాలని, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించాలని వక్ఫ్‌బోర్డు అధికారులకు సూచించారు. ఆయన వెంట ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీణ, డీఎస్పీ ప్రకాష్, సీఐ రామలింగారెడ్డి, ఎస్సై లింగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ ఆరాధన క్షేత్రం బుద్ధవనం


బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న జస్టిస్ తశి రబ్‌స్తాన్ దంపతులు

నాగార్జునసాగర్: బుద్ధవనం ప్రపంచ బౌద్ధ ఆరాధన క్షేత్రంగా విరాజిల్లనుందని జమ్మూకశ్మీర్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, జమ్మూకశ్మీర్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ తశి రబ్‌స్తాన్ అన్నారు. బుధవారం రాత్రి కుటుంబ సమేతంగా నాగార్జునసాగర్‌కు చేరుకున్న వారు గురువారం ఉదయం లాంచీలో వెళ్లి నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం బుద్ధవనానికి చేరుకుని బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. మహాస్థూపంలోని రెండవ అంతస్తులోగల ధ్యానమందిరంలో కాసేపు ధ్యానం చేశారు. అష్టబుద్ధులను దర్శించుకున్నారు. పర్యాటక గైడ్ సత్యనారాయణ వీరికి బుద్ధవనం ప్రత్యేకతలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జమ్మూకశ్మీర్, లడక్ ప్రాంతాల నుంచి బౌద్ధ మతస్తులు అధిక సంఖ్యలో నాగార్జునసాగర్‌ను సందర్శిస్తుంటారని, తాను బౌద్ధ ఆరాధుడనని తెలిపారు. రాబోయే తరాలకు ఈ ప్రాంతం ప్రపంచ బౌద్ధ ఆరాధన క్షేత్రంగా విరాజిల్లుతుందని పేర్కొన్నారు.

దొంగల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు సుధీర్, గోపికృష్ణ


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

- పట్టపగలు చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితుల రిమాండ్
- 6 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం

నకిరేకల్ : పట్టపగలే తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్న ముఠాను నకిరేకల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం రాములబండ గ్రామానికి చెందిన మంత్రి రామకృష్ణ, కట్టంగూరు మండలం కలిమెర గ్రామానికి చెందిన మేడి విజయ్‌కుమార్, నల్లగొండ పట్టణంలోని సుందరయ్యనగర్ చెందిన గార్లపాటి రాంబాబు ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతూ జల్సాలకు అలవాటు పడడంతో పాటు మద్యానికి బానిసయ్యారు. ఈ ముగ్గురిపై గతంలో వేర్వేరు పోలీస్ స్టేషన్లలో చోరీ కేసులు నమోదు కావడంతో పాటు జైలు శిక్ష కూడా అనుభవించారు. గత ఏడాది జనవరి 4వ తేదీన ముగ్గురు జైలు నుంచి విడుదలయ్యారు. వీరు జైలులోనే ముఠాగా ఏర్పడి జైలు నుంచి విడుదల అయ్యాక తిరిగి పట్టపగలు చోరీలకు పాల్పడటం మొదలుపెట్టారు.

చందుపట్లలో చోరీతో గుట్టురట్టు..

రామకృష్ణ, విజయ్‌కుమార్, రాంబాబు ఉదయం వేళ గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడేవారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన ఆలకుంట్ల వెంకటేశ్వర్లు ఈ నెల 7వ తేదీన అయ్యప్ప పూజ ఉందని ఇంటికి తాళం వేసి నకిరేకల్‌కు వెళ్లాడు. ముగ్గురు నిందితులు అదే రోజు తాళం వేసిన ఉన్న ఆలకుంట్ల వెంకటేశ్వర్లు ఇంట్లో పట్టపగలు చోరీకి పాల్పడి 6 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. అనంతరం వీరు తమ అవసరాల కోసం నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో గల ముత్తూట్ ఫైనాన్స్‌లో విజయ్‌కుమార్ పేరు మీద కొన్ని బంగారు ఆభరణాలు కుదవపెట్టి వచ్చిన డబ్బులను పంచుకున్నారు. బాధితుడు వెంకటేశ్వర్లు చోరీ జరిగిన మరుసటి రోజు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న నకిరేకల్ ఎస్‌ఐ సుధీర్, కానిస్టేబుళ్లు వై. వెంకటేశ్వర్లు, మధుకర్ ఒక టీంగా ఏర్పడి టెక్నాలజీ సహాయంతో చోరీకి పాల్పడింది రామకృష్ణ, విజయ్‌కుమార్, రాంబాబు అని గుర్తించారు. ముగ్గురు నిందితులు ఎక్కడెక్కడ సంచరిస్తున్నారనే సమాచారాన్ని టెక్నాలజీ సహాయంతో తెలుసుకున్న పోలీసులు గురువారం నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామ స్టేజీ వద్ద సూర్యాపేట వైపు స్కూటీపై వెళ్తున్న ముగ్గురు నిందితులను వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారిస్తే చందుపట్లలో చోరీ చేసిన కొన్ని బంగారు ఆభరణాలను సూర్యాపేటలో అమ్మేందుకు వెళ్తున్నామని నేరం అంగీకరించారు. నిందితుల నుంచి యాక్టీవా బైక్, నాలుగు సెల్‌ఫోన్లు, ఆరు తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. ముగ్గురిని రిమాండ్‌కు పంపామని పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ సుధీర్ టీంను, వారికి సహకారం అందించిన ఎస్‌ఐ గోపికృష్ణ, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, మధుకర్‌ను సీఐ అభినందించారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లేవారు తమ ఇంట్లోని విలువైన వస్తువులను తమ వెంటే తీసుకెళ్లాలని సీఐ రాజశేఖర్ సూచించారు. అదేవిధంగా తాళం వేసి వెళ్లే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.